
సాక్షి
కాకినాడ

ఆదివారం । 31 । మార్చి । 2024



'క్రాఫ్ట్ పేపర్స్'లో అగ్ని ప్రమాదం

మండలంలోని జేగురుపాడు శివార్లలోని శ్రీ మెహర్ గాయత్రీదేవి క్రాఫ్ట్ పేపర్స్ ఎల్‌ఎల్‌పీ పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.7 కోట్లు పైగా ఆస్తి నష్టం వాటిల్లింది. - IIలో ▸



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 2,472, మధ్య డెల్టాకు 1,607, పశ్చిమ డెల్టాకు 4,300 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది (సా॥)	సెహరీ సోమ (ఉ॥)
రాజమహేంద్రవరం	6.24	4.36
కాకినాడ	6.24	4.36
అమలాపురం	6.24	4.36

న్యూస్‌రీల్

నూతన కలెక్టర్‌ను కలసిన ఎస్పీ



కలెక్టర్ నివాస్‌ను కలసిన ఎస్పీ సతీష్ కుమార్

కాకినాడ సిటీ: జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జె.నివాస్‌ను ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ శనివారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

శృంగార వల్లభుని సన్నిధికి పోటెత్తిన భక్తులు



స్వామి వారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

పెద్దాపురం: మండలంలోని తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వేంచేసిన శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ప్రసాద వితరణ, అన్నదానం చేశామని ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ ఆధ్వర్యాన ముందస్తు చర్యలు చేపట్టారు. వివిధ సేవల ద్వారా స్వామి వారికి రూ.3,38,655 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు.

ప్రతి గింజా కొనేలా..

- రబీ ధాన్యం సేకరణకు అధికారుల ప్రణాళికలు
- రేపటి నుంచి కొనుగోళ్లు ప్రారంభం
- లక్ష్యం 1.92 లక్షల మెట్రిక్ టన్నులు
- 214 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ప్రారంభమైన వరి కోతలు



కాకినాడ సిటీ: జిల్లాలో రబీ వరి కోతలు ప్రారంభమయ్యాయి. వారం పది రోజుల వ్యవధిలో ఇవి మరింత వేగం పుంజుకోనున్నాయి. ఈ నేపథ్యంలో రైతులకు లబ్ధి చేకూర్చే లక్ష్యంతో, వారు దళారుల మోసాల బారిన పడకుండా చూసేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటోంది. వరి కోతలు పూర్తయిన వెంటనే ఆలస్యం లేకుండా ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేసింది. రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేసి, వారికి దన్నుగా నిలవాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం అధికార యంత్రాంగం ఎన్నికల ప్రక్రియలో తలమునకలవుతున్నా.. రైతులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా ధాన్యం కొనుగోళ్లపై చర్యలు తీసుకుంటోంది. ధాన్యం నూర్పిళ్లు జరగడానికంటే ముందుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకుని వస్తోంది. సోమవారం నుంచి ధాన్యం సేకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. ధాన్యం కొనుగోలుపై ఇప్పటికే అధికారులకు శిక్షణ సైతం పూర్తి చేశారు.

6.87 లక్షల ఎకరాల్లో వరి సాగు

ప్రస్తుత రబీలో జిల్లావ్యాప్తంగా సుమారు 6.87 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. అధికారుల అంచనా ప్రకారం 3.36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఈ ధాన్యం సేకరణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ పక్కాగా పూర్తి చేశారు. ధాన్యం సేకరణకు 25.60 లక్షల గోనె సంచులు అవసరం కాగా, ప్రస్తుతం 33 శాతం అంటే 8.44 లక్షలు సిద్ధంగా ఉంచారు. కొత్తగా 15 లక్షల గోనె సంచుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపారు. జిల్లాలో వరి కోతలు వేగం అందుకునే నాటికి అవసరమైనన్ని గోనె సంచులు, కాంటాలు, టార్పాలిన్లు, తేమ శాతం కొలిచే యంత్రాలను సమకూర్చుకోవాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను, అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఇప్పటికే ఆదేశించారు. డిమాండ్ మేరకు ప్రతి గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో (ఆర్‌బీకే) కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 214 ఆర్‌బీకేలతో పాటు 70 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. పొలం నుంచి ధాన్యాన్ని మిల్లర్ల వద్దకు చేర్చి, రైతులకు మద్దతు ధర కల్పించేంత వరకూ అధికారులు అడుగడుగునా అండగా నిలవనున్నారు.

తక్షణం ప్రారంభం

ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే పనిలో పౌర సరఫరాలు, సహకార తదితర శాఖలు నిమగ్నమయ్యాయి. సోమవారం నుంచి ప్రతి మండల కేంద్రంలో, ప్రతి సచివాలయ పరిధిలోని ఆర్‌బీకే వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని జేసీ రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. కోతలు ప్రారంభమైన గ్రామాల్లో వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, ధాన్యం కొనుగోలు చేయాలని చెప్పారు. ఈ నేపథ్యంలో అధికారులు ముఖ్యంగా రవాణా, రైస్ మిల్లుల కేటాయింపుతో పాటు గోనె సంచులు, హమాలీలు, కాంటాలు, ఇతర సామగ్రిని సమకూర్చుకునే పనిలో తలమునకలవుతున్నారు. గత ఖరీఫ్‌లో 1.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, మిల్లర్లు కూడా కొంత ధాన్యాన్ని కొన్నారు.

కనీస మద్దతు ధర (రూ.)

ధాన్యం రకం	క్వింటాల్ (100 కేజీలు)	75 కేజీలు	40 కేజీలు
సాధారణ రకం	2,183	1,637	873
గ్రేడ్–ఎ	2,203	1,652	881

ముందుగానే మద్దతు ధర

రబీ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించడానికి ముందే ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. గతం కంటే ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.143 పెంచింది. ఈ పెంపుదల రైతుల్లో ఆనందాన్ని నింపుతోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సాధారణ రకం ధాన్యం మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.2,183గా, గ్రేడ్–ఎ రకానికి రూ.2,203గా నిర్ణయించింది.

దళారులకు ఆస్కారం లేకుండా..

తేమ, రంగు మారడం, బహిరంగ విపణిలో ధర పలకడం లేదనే కారణాలు చెప్పి రైతులను దళారులు మోసం చేయకుండా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంది. ఆర్‌బీకేల ద్వారా వ్యవసాయ, రెవెన్యూ, పౌర సరఫరాలు, తూనికలు–కొలతలు, ఇతర శాఖల సమన్వయంతో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. సేకరణ ప్రక్రియ పారదర్శకంగా, పక్కాగా చేపడుతున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు అప్పగించడం, తిరిగి మిల్లర్ల ద్వారా బియ్యం సేకరణకు అన్ని చర్యలూ తీసుకుంటున్నారు. అవసరమైన సిబ్బందిని ఆర్‌బీకేల వద్ద సిద్ధంగా ఉంచారు. ఈ–క్రాప్, తేమ శాతం నిబంధనల ప్రకారం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు (వీఏఏ) ధాన్యం సేకరిస్తారు. ధాన్యం రవాణా చేసే వాహనాలపై నిఘా పెడుతున్నారు. రవాణా చార్జీలు ఎవరికి చెల్లించాలనే విషయమై కూడా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

కోడ్‌కు అనుగుణంగా..

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ధాన్యం మిల్లులకు రవాణా చేయడంపై జేసీ రామ్‌సుందర్‌రెడ్డి అధికారులు, మిల్లర్లతో రెండు రోజులుగా సమీక్షలు నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమలులో ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద ప్రజాప్రతినిధుల ఫొటోలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. ఈ మేరకు అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ కోసం పందిళ్లు లేదా టెంట్లు ఏర్పాటు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు



జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. సోమవారం నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. కోతలు ప్రారంభమవుతున్న ప్రాంతాల వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి కొనుగోలు చేస్తాం. రైతులు పండించిన ప్రతి గింజకూ మద్దతు ధర అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్, కాకినాడ

ఎన్నికల నిర్వహణపై
సమగ్ర శిక్షణ

- ఎన్నికల సంఘం మార్గదర్శకాలు సమర్థంగా అమలు చేయాలి
- నోడల్ అధికారులకు కలెక్టర్ నివాస్ ఆదేశం



కలెక్టర్ సమీక్షలో పాల్గొన్న అధికారులు

కాకినాడ సిటీ: ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు సమగ్ర శిక్షణ ఇవ్వాలని నోడల్ అధికారులను జిల్లా కలెక్టర్ జె.నివాస్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణపై ఒక రోజంతా పూర్తిగా శిక్షణ ఇవ్వాలన్నారు. ఓటర్లు వచ్చి ఏవిధంగా ఓటు వేస్తారు, అధికారుల్లో ఎవరి పాత్ర ఏమిటనే విషయాలపై డెమో ద్వారా శిక్షణ ఇవ్వాలని సూచించారు. మధ్యాహ్నం నుంచి పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై కూడా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతి రోజూ అనేక సూచనలు, మార్గదర్శకాలు జారీ చేస్తుందని, వీటిని ప్రతి ఒక్కరూ పక్కాగా అమలు చేయాలని, దీనిలో ఏమాత్రం నిర్లక్ష్యం పనికిరాదని స్పష్టం చేశారు. సందేహాలుంటే కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగాన్ని సంప్రదించాలని సూచించారు. ఎన్నికలకు అవసరమైన పరికరాలు, సామగ్రి సమకూర్చుకోవాలన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు స్వీప్ కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని అన్నారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాలను తెలుసుకునే కార్యక్రమాన్ని బూత్ స్థాయి అధికారులు పక్కాగా చేపట్టాలని, ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులపై ప్రత్యేకంగా దృష్టి సారించి, సీ–విజిల్ యాప్ ద్వారా 24 గంటల్లో పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఫ్లయింగ్ సర్వైలెన్స్ టీములను మూడు షిఫ్టుల్లో నియమించాలని, ఒక వారం ఒక షిఫ్ట్‌లో పని చేసిన వారిని రెండో వారం వేరే షిఫ్టుకు మార్చాలని ఆదేశించారు. సువిధ యాప్ ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అభ్యర్థులకు అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ నివాస్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ తిప్పేనాయక్, సీపీఓ పి.త్రినాథ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రత్నగిరిపై భక్తుల రద్దీ

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- రూ.40 లక్షల ఆదాయం

అన్నవరం: వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో రత్నగిరి శనివారం కిటకిటలాడింది. శుక్రవారం రాత్రి రత్నగిరిపై, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవదంపతులు, వారి బంధుమిత్రులు అధిక సంఖ్యలో సత్యదేవుని దర్శనానికి తరలి వచ్చారు. వారికి సాధారణ భక్తులు కూడా తోడవడంతో ఆలయంలో తీవ్ర రద్దీ ఏర్పడింది. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి, పూజలు చేశారు. సత్యదేవుని వ్రతాలు 1,900 జరిగాయి. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. భక్తుల రద్దీ కారణంగా ప్రదక్షిణ దర్శనాన్ని మధ్యాహ్నం వరకూ నిలిపివేశారు. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. అన్నదాన పథకంలో 4 వేల మందికి భోజనం పెట్టారు.



సత్యదేవుని ఆలయం వద్ద క్యూలో నిల్చున్న భక్తులు

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ

రత్నగిరిపై సత్యదేవుని ప్రాకార సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను తూర్పు రాజగోపురం వద్దకు తీసుకుని వచ్చారు. తిరుచ్చి వాహనంపై వేంచేయించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్య ఘోష నడుమ, పెద్ద సంఖ్యలో భక్తులు వెంట రాగా స్వామి, అమ్మవార్లను ఆలయ ప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు హారతి ఇచ్చి, తిరిగి ఆలయానికి ఊరేగింపుగా తీసుకుని వెళ్లారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చకుడు గంగాధరభట్ల శ్రీనివాస్, ఏఈఓ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సైనిక విన్యాసాలు

- తిరుగుపయనమైన భారత్ – అమెరికా దళాలు
- నేటి నుంచి బీచ్ రోడ్డులో రాకపోకలకు అనుమతి



నింగి, నేల, నీరు.. ఎక్కడైనా శత్రువుకు దడ పుట్టిస్తాం : కాకినాడ తీరంలో చివరి రోజు ఆకట్టుకున్న త్రివిధ దళాల విన్యాసాలు

కాకినాడ రూరల్: భారత్ – అమెరికా రక్షణ దళాలు ఐదు రోజులుగా కాకినాడ సాగర తీరంలో నిర్వహిస్తున్న సంయుక్త సైనిక విన్యాసాలు శనివారం ముగిశాయి. టైగర్ ట్రయాంఫ్ పేరిట మూడో ఎడిషన్‌గా చేపట్టిన ఈ విన్యాసాలు ఈ నెల 18న విశాఖపట్నంలో హార్బర్ ఫేజ్‌తో ప్రారంభమయ్యాయి. దీనికి కొనసాగింపుగా రెండో దశలో కాకినాడ సీ ఫేజ్‌లో ఈ నెల 26న యాంఫిబియస్ (ఉభయచర) విన్యాసాలు చేపట్టారు. ఇందులో భారత్‌కు చెందిన త్రివిధ దళాల అధికారులు, సైనికులు సుమారు 700 మంది, అమెరికా రక్షణ దళ అధికారులు, సైనికులు 350 మంది ఈ విన్యాసాల్లో పాల్గొని, యుద్ధ నైపుణ్యాలను పరస్పరం పంచుకున్నారు. యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, అధునాతన ఆయుధాలు, యుద్ధ ట్యాంకుల వంటి వాటితో ఈ విన్యాసాలు నిర్వహించారు. వీటిని ఇరు దేశాల రక్షణ దళాల అధికారులు స్వయంగా పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. చివరి రోజున పలు రకాల ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించారు. అనంతరం తూర్పు నౌకాదళ సిబ్బంది యుద్ధ నౌకలతో విశాఖకు, సైనిక దళాలు రోడ్డు మార్గంలో తిరుగు పయనమయ్యాయి. సైనిక విన్యాసాల కారణంగా ఈ నెల 25వ తేదీ సాయంత్రం నుంచి కాకినాడ – ఉప్పాడ మధ్య మూసివేసిన బీచ్ రోడ్డుపై ఆదివారం ఉదయం నుంచి యథాతథంగా రాకపోకలను అనుమతిస్తామని పోలీసులు తెలిపారు.

శ్రీకాళహస్తి నమూనాలో..

- ఆవిధంగానే రత్నగిరిపై నూతన ధ్వజస్తంభం
- పీఠం నుంచి శిఖరం వరకూ స్వర్ణమయం
- మూడు రోజుల్లో పాత స్తంభం తొలగింపు పనులు పూర్తి

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని సన్నిధిలో నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. దీనిని శ్రీకాళహస్తి ఆలయంలో మాదిరిగా దిగువన పీఠం నుంచి స్తంభం పై భాగం వరకూ బంగారు రేకుతో తాపడం చేయాలని అధికారులు నిర్ణయించారు. నెల్లూరుకు చెందిన ఒక దాత రూ.4 కోట్ల వ్యయంతో నూతన ధ్వజస్తంభం ఏర్పాటుకు, బంగారు రేకు తాపడానికి సంసిద్ధత వ్యక్తం చేసిన విషయం విదితమే. దేవదాయ శాఖ ఉన్నతాధికారుల సూచన మేరకు బంగారు రేకు తాపడం చేసే పనిని చెన్నైకి చెందిన సంస్థకు దాత అప్పగించారు. ఈ సంస్థ సింహాచలం దేవస్థానంలో కూడా ధ్వజస్తంభానికి స్వర్ణ రేకు తాపడం చేసింది. కొత్త ధ్వజస్తంభం ఏర్పాటుకు ఇప్పటికే 65 అడుగుల కర్ర తీసుకుని వచ్చారు. నూతన ధ్వజస్తంభాన్ని వచ్చే నెల 22న ప్రతిష్ఠించనున్నారు. ఈ ప్రతిష్ఠా మహోత్సవాలకు వచ్చే నెల 18న శ్రీకారం చుడతారు.

సత్యదేవుని ఆలయంలో ప్రస్తుతం వెండి రేకు తాపడంతో ఉన్న ధ్వజస్తంభం తొలగింపు పనులు మంగళవారంతో పూర్తవుతాయని డీఈ ఉదయ్ తెలిపారు. ఆ రోజు ధ్వజస్తంభాన్ని పైకి లేపి, నేలపై ఉంచుతారని, అనంతరం ఆ కర్రకు ఉన్న వెండి రేకు తొలగిస్తారని చెప్పారు. దేవదాయ శాఖ జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి సమక్షంలో వెండి రేకు బరువు తూచి, దేవస్థానంలో భద్రపరచనున్నారు. దీని కోసం దేవస్థానం అధికారులతో ఈఓ కె.రామచంద్ర మోహన్ ఒక కమిటీ ఏర్పాటు చేశారు. నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠ అనంతరం తొలగించిన పీఠంలోని గ్రానైట్ శిల్పాలను యథాతథంగా అమర్చుతారు. అనంతరం పీఠం కొలతలు తీసి, బంగారు రేకు తయారు చేస్తారు. ఆ తరువాత బంగారు రేకు తాపడం పనులు ప్రారంభిస్తారు. ధ్వజస్తంభంపై నాలుగు వైపులా దేవతామూర్తులను ఏర్పాటు చేయనున్నారు. నూతన స్వర్ణ ధ్వజస్తంభంతో దేవాలయం స్వర్ణ శోభను అద్దుకోనుంది.



శ్రీకాళహస్తి దేవస్థానంలోని స్వర్ణ ధ్వజస్తంభం



శ్రీకాళహస్తి ధ్వజస్తంభంపై దేవతా మూర్తులు



సత్యదేవుని సన్నిధిలో పీఠం తొలగించిన ప్రస్తుత ధ్వజస్తంభం

రథానికి వెండి రేకు తాపడం

రత్నగిరిపై ఆలయ ప్రాకారంలో ప్రతి ఆదివారం ఉదయం నిర్వహిస్తున్న రథసేవలో ఉపయోగిస్తున్న సత్యదేవుని నూతన టేకు రథానికి వెండి రేకు తాపడం చేయించాలని దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశించారు. ఈఓ కె.రామచంద్ర మోహన్ శనివారం ఈ విషయం తెలిపారు. వెండి తాపడం చేసేందుకు దాతలు ముందుకు వస్తే అవకాశం కల్పించాలని, లేకుంటే దేవస్థానం వద్ద ఉన్న వెండితోనైనా తాపడం చేయించాలని ఆదేశించారని వివరించారు. ఈ రథానికి వెండి తాపడం చేయించాలని గతంలోనే అనుకున్నారు. అయితే దాతలు ముందుకు రాకపోవడంతో గత నెల 16న రథసప్తమి పర్వదినం సందర్భంగా ఈ రథాన్ని రత్నగిరికి తరలించారు. గత నెల 22న ఈ రథంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు ప్రారంభించారు. ఆ తరువాత ప్రతి ఆదివారం దీనిని కొనసాగిస్తున్నారు. ఈ రథ సేవను రూ.2,500 టికెట్టుతో ఆర్జిత సేవగా నిర్వహించేందుకు కూడా కమిషనర్ ఆమోదం తెలిపారు. గత ఆదివారం నుంచే ఈ ఆర్జిత సేవను దేవస్థానంలో అమలు చేస్తున్నారు.



సత్యదేవుని టేకు రథ సేవ

క్లుప్తంగా

మూణ్నాళ్ల మురిపెం! ఆ సిరా గురుతు!!



అంబాజీపేట: 'నీ వేలిపై సిరా చుక్క దేశ ప్రగతికి వేగు చుక్క' అంటూ ఎన్నికల సంఘం ఓటు విలువను తెలియజేస్తుంటుంది. ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతి వ్యక్తికీ ఎడమచేతి బొటన వేలిపై సిరా చుక్క పెడతారు. చేతి వేళ్లులేని దివ్యాంగులకు కాలి వేళ్లకు సిరా చుక్క పెడతారు. ఇది ఓటేశామని గుర్తు మాత్రమే కాదు. దొంగ ఓట్లను నిరోధించే ఆయుధం. ఎన్నికలలో వాడే ఇండెలిబుల్ ఇంక్ వేలిపై పెడితే 72 గంటల పాటు చెరిగిపోదు. ఈ సిరాను 1962 నుంచి కర్ణాటకలోని మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ కంపెనీ తయారు చేస్తోంది. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఆ కంపెనీ నుంచే సిరా సరఫరా అవుతుంది. సిరాలో 7.25 శాతం సిల్వర్ నైట్రేట్ ఉండడంతో ఎక్కువ కాలం చెరిగిపోకుండా ఉంటుంది.

ఆబోతు మృతదేహం ఊరేగింపు



వాడపాలెంలో ఆబోతు మృతదేహాన్ని ఖననం చేస్తున్న దృశ్యం

కొత్తపేట: మండలంలోని వాడపాలెంలో ఒక ఆబోతు మృతి చెందగా దానిని గ్రామంలో ఊరేగించి, ఖననం చేశారు. గ్రామానికి చెందిన రంకిరెడ్డి త్రిమూర్తులు, శ్రీనివాస్ అనే తండ్రీ, తనయులు సుమారు ఐదేళ్ల క్రితం ఆవుకు, ఆబోతుకు పెళ్లి చేసి ఆబోతును గ్రామంలో వదిలారు. దాంతో ఆ ఆబోతు వాడపాలెం, పరిసర పనసలదొడ్డి, పెదరాముడినూతిమెరక, చినరాముడినూతిమెరక తదితర శివారు గ్రామాల్లో తిరుగుతూ ఉండేది. ఈ ఆబోతు శుక్రవారం వాడపాలెంలో ఒకరి ఇంటి సెప్టిక్ ట్యాంక్‌లో పడి మృతి చెందింది. ఆబోతు మృతదేహాన్ని అతి కష్టం మీద బయటకు తీయగా ఆబోతును వదిలిన త్రిమూర్తులు కుటుంబం ఆ ఆబోతు మృతదేహాన్ని తమ ఇంటికి తీసుకువెళ్లి పూజలు నిర్వహించి, ట్రాక్టరుపై గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం తమ సొంత భూమిలో ఖననం చేయించారు.

జగన్‌ను సీఎం చేయడమే లక్ష్యం

మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ




ముద్రగడను ఆయన నివాసంలో కలుసుకున్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నాయకులు, గూడూరి శ్రీనివాస్, జక్కంపూడి గణేశ్

కిర్లంపూడి: రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అధికారంలోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా నాయకులు, కర్యకర్తలు పనిచేయాలని మాజీ మంత్రి, కాపు ఉద్యమనేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి సుమారు 150 మంది నాయకులు, కార్యకర్తలు శనివారం ముద్రగడను, యువ నాయకుడు గిరిబాబును వారి నివాసంలో మార్యాద పూర్వకంగా కలిశారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గం ఇన్చార్జి, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జక్కంపూడి గణేశ్ ముద్రగడను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల ప్రచారానికి తీసుకోవాలసిన ప్రణాళికలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ నిరుపేదలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మరిన్ని సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రాభివృద్ధికి రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞాప్తి చేశారు. గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం వైఎస్సార్ సీపీలోకి రావడం పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గాల్లో సేవలందించేదుకు ముద్రగడను ఆహ్వానించినట్టు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7 నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. పశ్చిమగోదావరి జిల్లా రాష్ట్ర కాపు జేఏసీ సభ్యుడు తోట రామకృష్ణ, జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు చిన్నిమిల్లి వెంకటరాయుడు, గణేశుల రాంబాబు, నీలి ఆనంద్, అడపా అనిల్, ఇసుకపల్లి శ్రీను, గణేశుల లచ్చబాబు, గౌతు స్వామి తదితరులు ఉన్నారు.

గురుకుల ప్రవేశాల గడువు పెంపు

తుని రూరల్: ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి గడువు పెంచినట్టు కన్వీనర్, తుని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ఎంటీ హేమలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తుని (బాలికలు), భూపతిపాలెం (బాలురు) ఐదో తరగతి అన్ని సీట్లు, ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో మిగిలిన సీట్లు, ఇంటర్మీడియట్, డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల గడువు వచ్చే నెల ఐదో తేదీ వరకు పొడిగించినట్టు ఆమె పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి ఈ నెల 31తో గడువు ముగిసిందని, గడువు పెంపును ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చదువుకున్న విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. ఆసక్తి, అర్హతగల విద్యార్థులు ఏపీఆర్ఎస్.ఏపీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 87126 25029 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

పవన్ వస్తారని పాదగయకు నో ఎంట్రీ



పాదగయ క్షేత్రంలో గేట్లు మూసి భక్తులను నిలిపివేసిన అధికారులు

పిఠాపురం: జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పాదగయలో పూజలు నిర్వహిస్తారనే సమాచారంతో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. కాకినాడ బైపాస్ రోడ్డు వైపు ఉన్న పాదగయ క్షేత్రం గేట్లు మూసివేసి భక్తులను రానివ్వకుండా అడ్డుకోవడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. సుదూర ప్రాంతాల నుంచి స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం వచ్చిన తమను రాజకీయ నాయకులు వస్తున్నారనే వంకతో ఆలయంలో ప్రవేశం లేదని నిలిపివేయడం ఎంత వరకు సమంజసమంటూ ప్రశ్నించారు. సాయంత్రం 4 గంటల నుంచి ఆరు గంటల వరకు దర్శనాలు నిలిపివేయడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆరు గంటలకు పవన్‌కల్యాణ్ పర్యటన వాయిదా పడిందనే సమాచారంతో భక్తులను అనుమతించారు.

'క్రాఫ్ట్ పేపర్స్'లో అగ్ని ప్రమాదం

- రూ.7 కోట్లకు పైగా ఆస్తినష్టం
- పరిశీలించిన డీఎస్పీ అంబికా ప్రసాద్



పరిశ్రమలో చెలరేగిన మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కడియం: మండలంలోని జేగురుపాడు శివార్లలోని శ్రీ మెహర్‌గాయత్రీదేవి క్రాఫ్ట్‌పేపర్స్ ఎల్ఎల్‌పీ పరిశ్రమలో 28వ తేదీ తెల్లవారు జామున అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సరఫరాకు సిద్ధంగా ఉన్న క్రాఫ్ట్ పేపర్‌తో పాటు, యంత్ర సామగ్రి కూడా మంటల్లో చిక్కుకుని దెబ్బతిందని బాధితులు తెలిపారు. ఈ మేరకు సదరు మిల్లు మేనేజర్ మండపేట మండలం గొల్లపూడికి చెందిన కంఠంశెట్టి మల్లికార్జునరావు కడియం పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. నిల్వ ఎక్కువగా ఉండడంతో రెండు నెలలుగా మిల్లు నిలిపివేశామని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే 28వ తేదీ తెల్లవారు జామున తమ యజమాని వల్లూరి మెహర్ చైతన్యకు సెక్యూరిటీ నుంచి అగ్ని ప్రమాదం విషయమై ఫోను వెళ్లిందన్నారు. ఆయన తనకు సమాచారం ఇచ్చారని వెంటనే తాను ప్రమాదస్థలికి చేరుకున్నానన్నారు. రాజమహేంద్రవరం, మండపేట, అనపర్తిలకు చెందిన ఫైర్ ఇంజిన్లు వచ్చి మంటలను ఆర్పాయన్నారు. ఈ ప్రమాదంలో సరఫరాకు సిద్ధంగా ఉన్న క్రాఫ్ట్‌పేపర్, యంత్రసామగ్రి తదితర వస్తువులు కాలిపోవడంతో ఏడు కోట్ల రూపాయల వరకు నష్టం సంభవించిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. మిల్లు మేనేజర్ ఫిర్యాదు మేరకు రాజమహేంద్రవరం దక్షిణ మండలం డీఎస్పీ అంబికా ప్రసాద్, కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని విచారణ ప్రారంభించారు. అలాగే అగ్నిమాపక సిబ్బంది, విద్యుత్, పరిశ్రమల శాఖ సిబ్బందికి కూడా ఘటనా స్థలానికి చేరుకుని ఫిర్యాదు చేసారు. కాగా ఊరికి దూరంగా మిల్లు ఉండడంతో పాటు, గత కొన్నాళ్లుగా పనిచేయకపోవడంతో ప్రమాద సమాచారం బయటకు రావడం ఆలస్యమైంది. ఇదిలా ఉండగా ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

రివర్‌బేపై విజిలెన్స్ దాడులు



హోటల్ రివర్ బేలో తనిఖీలు చేస్తున్న అధికారులు

- 25శాతం టీపీసీ దాటిన వంటనూనె
- కార్పొరేషన్‌కు రూ.13.77 లక్షల బకాయిల గుర్తింపు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం సిటీ): స్టార్ హోటల్‌గా పేరొందిన గోదావరి గట్టున ఉన్న రివర్ బే హోటల్‌ను శనివారం విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ దాడుల్లో వంటనూనె 25 శాతం టోటల్ పోలార్ కాంపౌండ్ (టీపీసీ) దాటి ఉండడాన్ని గుర్తించారు. అంతేగాక మరిన్ని అక్రమాలను గుర్తించారు. హోటల్ నుంచి ఫుడ్ సేఫ్టీ అధికారులు చికెన్ ఫ్రై నమూనాలను సేకరించి ఫుడ్ లాబొరేటరీకి పంపించారు. అదే విధంగా హోటల్‌లో ఉపయోగిస్తున్న ఎడిబుల్ ఆయిల్స్‌లో టోటల్ పోలార్ కాంపౌండ్స్ మీటర్ రీడింగ్ 25 శాతం లోపు ఉండాల్సి వుండగా దానికన్న ఎక్కువగా ఉండడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసు నమోదు చేశారు. అంతే కాకుండా హోటల్ యాజమాన్యం రూ.13,77,220 మున్సిపల్ కార్పొరేషన్ డిమాండ్ నోటీసు ప్రకారం ట్రేడ్ లైసెన్సు ఫీజు బకాయి ఉన్నట్లు గుర్తించారు. హోటల్‌లో స్టాంప్ లేని తూకం యంత్రం ఉండడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు వేయింగ్ మెషీన్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. జీఎస్టీ రిటర్న్‌లు సెప్టెంబర్-2023 నుండి ఫైల్ చేయనట్టు గుర్తించినట్టు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో హోటల్స్, రెస్టారెంట్లలో కిచెన్లు పరిశుభ్రంగా వుంచాలని, రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు సూచనల మేరకు వినియోగదారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారపదార్థాలు అందించాలని, లేకపోతే సంబంధిత రెస్టారెంట్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి అన్నారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారులు ముత్యాలు నాయుడు, శ్రీనివాస రెడ్డి, నాగ వెంకట రాజు, భార్గవ్ మహేష్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రుక్కయ్య, లీగల్ మెట్రాలజీ అధికారి సాల్మాన్ రాజు, వలి, శివ పాల్గొన్నారు.

సీఎంఆర్ జ్యువెలరీ షోరూమ్ ప్రారంభం



సీఎంఆర్ జ్యువెలరీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సినీ నటి అమృత అయ్యర్, సంస్థ ఎండీ మావూరి వెంకటరమణ తదితరులు

కాకినాడ సిటీ: నగరంలో సీఎంఆర్ జ్యువెలరీ ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌ను హనుమాన్ ఫేమ్ హీరోయిన్, సినీ నటి అమృత అయ్యర్, రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ చైర్మన్ ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ పెద్ది రత్నాజీ, సీఎంఆర్ గ్రూప్ ఫౌండర్ అండ్ చైర్మన్ మావూరి వెంకటరమణ తదితరులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ కాకినాడలో అతి పెద్ద బంగారు ఆభరణాల ఎక్స్‌క్లూజివ్ షోరూమ్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. వినియోగదారుల శైలికి తగ్గట్టుగా ప్రాచీనత నుంచి ఆధునికత వరకు అన్ని రకాల ఆభరణాలు అందుబాటులో ఉంచామన్నారు. తమ షోరూమ్‌లో బంగారు ఆభరణాలపై అతి తక్కువ తరుగు 3 శాతం నుంచి ప్రారంభం అన్నారు. వెండి వస్తువులపై తరుగు, మజూరీ లేదన్నారు. దాదాపు ఐదు దశాబ్దాలుగా ఆభరణాల వ్యాపారంలో అత్యంత సుప్రసిద్ధమైన సంస్థల్లో ఒకటిగా ఖ్యాతి గడించిన సంస్థ సీఎంఆర్ ఎక్స్‌క్లూజివ్ జ్యువెలరీ షోరూమ్ అని సినీనటి అమృత అయ్యర్, ద్వారంపూడి వీరభద్రారెడ్డి అన్నారు. సీఎంఆర్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ మాట్లాడుతూ మార్కెట్‌లో ప్రస్తుత ట్రెండ్‌కి అనుగుణంగా లేటెస్ట్ కలెక్షన్లతో సీఎంఆర్ ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌ను కాకినాడ దేవాలయం వీధిలో ఏర్పాటు చేశామన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా గ్రాముకు రూ.250 వరకు తగ్గింపు ప్రకటించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మేనేజర్ వైఎల్ చౌదరి, ప్రముఖ వ్యాపారవేత్త రాపాక వెంకట్ ఆనంద్, బాదం సుందరరావు, పి.మంగరాజు, గొడవర్తి లక్ష్మీ లావణ్య, మేనేజర్లు బి.రమేష్‌కుమార్, ఆసిఫ్ ఇక్బాల్, లయన్ రాజు, మాజీ కార్పొరేటర్ బన్నీ పాల్గొన్నారు.

ఆహ్వానం లేదు.. ఫొటోకూ చోటు లేదా!

- నియోజకవర్గ సమావేశానికి జవహర్‌కు అందని ఆహ్వానం
- అలంకారప్రాయంగా జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి
- మాజీ మంత్రికి తప్పని పరాభవం
- దళితుడనే వివక్ష అంటూ ఆయన వర్గీయుల ఆగ్రహం
- టీడీపీలో సద్దుమణగని విభేదాలు



జవహర్‌కు మద్దతుగా తాడేపల్లిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయం వద్ద దళిత ప్రజా సంఘాల ఆందోళన

కొవ్వూరు: 'పదవి గొప్ప.. మర్యాద సున్నా' అన్నట్టుగా ఉంది మాజీ మంత్రి కేఎస్ జవహర్ పరిస్థితి. మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అయిన ఆయన తాజాగా ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కూడా నియమితులయ్యారు. ఎంత చరిత్ర ఉంటేనేం.. ఎన్ని పదవులు ఉంటేనేం .. కొవ్వూరులో శనివారం నిర్వహించిన టీడీపీ నియోజకవర్గ స్థాయి సమావేశానికి ఆయనకు కనీస ఆహ్వానం కూడా లేదు. సార్వత్రిక ఎన్నికల్లో కొవ్వూరు అసెంబ్లీ స్థానానికి టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ముప్పిడి వెంకటేశ్వరరావు పేరు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత తొలిసారిగా మూడు పార్టీలతో టీడీపీ నేత పెండ్యాల అచ్చిబాబు ఆధ్వర్యాన ఈ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ సమావేశానికి జవహర్‌కు ఆహ్వానం లేకపోగా.. ఆ వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో సైతం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో ఉన్న ఆయన ఫొటోకు చోటు దక్కలేదు. దీనినిబట్టి దళిత సామాజికవర్గ నేతకు టీడీపీలో దక్కిన గౌరవం ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.

దళితులపై చిన్నచూపు

కేవలం దళిత నేత కావడమే ఆయన చేసిన పాపమా? అంటూ టీడీపీ దళిత నాయకులు మండిపడుతున్నారు. ఆ పార్టీలో దళితులపై వివక్ష చూపుతున్నారనడానికి ఇదే నిదర్శనమని ఆరోపిస్తున్నారు. తానెవరికీ తలవంచే ప్రసక్తే లేదని, పెత్తందార్ల పైనే తన పోరాటమని, పార్టీకి బానిసగా పని చేస్తానని పలు సందర్భాల్లో జవహర్ ఇప్పటికే ప్రకటించారు. అందుకే పెత్తందార్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి జవహర్‌ను ఆహ్వానించలేదంటూ దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సమావేశానికి జవహర్ వర్గీయులు గైర్హాజరయ్యారు. టీడీపీలో పెత్తందార్ల హవానే నడుస్తోందని చెప్పడానికి ఈ సమావేశమే ఓ ఉదాహరణని విమర్శిస్తున్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ధర్నా

మరోవైపు జవహర్‌కు కొవ్వూరు టికెట్ కేటాయించాలని కోరుతూ దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యాన తాడేపల్లిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు, ఫ్లెక్సీలతో నిరసన తెలిపారు. ఈ ఆందోళనలో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు దళిత, ప్రజా సంఘాలు, మాదిగ దండోరా నేతలు పాల్గొని పార్టీ పెద్దలకు వినతి పత్రం సమర్పించారు. గుంటూరు, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన డప్పు కళాకారులు, చర్మకారులు, ఎంఆర్‌పీఎస్ నాయకులతో పాటు నియోజకవర్గ దళిత నాయకులు కూడా ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో జవహర్‌కు టికెట్‌పై టీడీపీలో మరోసారి రచ్చ నడుస్తోంది. తాను పోటీలో ఉంటానని జవహర్ ఇప్పటికే ప్రకటించగా.. ఆయనను అచ్చిబాబు వర్గం పూర్తిగా పక్కన పెట్టి దూకుడుగా వ్యవహరించడంతో విభేదాలకు మళ్లీ ఆజ్యం పోసినట్టయ్యింది. ఎన్నికల వేళ టీడీపీలో విభేదాలు సద్దుమణగకపోవడం చూసి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు.